www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 7 నవంబర్ 2024

5

పశ్చిమ గోదావరి



ప్రతి ఇంటికీ పాస్ బుక్ అందిస్తాం

జిల్లా సర్వేయర్ జాషువా

ఉండి : రీసర్వే పూర్తయిన ప్రతి ఇంటికీ పాస్‌బుక్ అందజేస్తామని జిల్లా సర్వేయర్ జాషువా అన్నారు. గత నెలలో కోలమూరులో రీసర్వేపై రెవెన్యూ సదస్సును రైతులు అడ్డుకోవడంతో బుధవారం మళ్లీ సదస్సు నిర్వహించారు. దీనికి విచ్చేసిన జాషువా మాట్లాడుతూ రీసర్వే పూర్తయిన ప్రతి ఇంటికి పాసుబుక్కును అందజేస్తామని, దాని ద్వారా బ్యాంకు రుణానికి అర్హులవుతారని అన్నారు. వంద సంవత్సరాల క్రితం రీసర్వే చేశారని, మళ్లీ ఇప్పుడు చేస్తున్నారని చెప్పారు. రీసర్వేను నిర్దిష్టమైన కొలతలతో పారదర్శకంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తమ గ్రామ సర్వేయర్ ఆత్మహత్య చేసుకున్నాడని, నాటి నుంచి సర్వేయర్ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలువురు జాషువా దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.నాగార్జున, ఉప సర్పంచి నడింపల్లి రాంబాబురాజు, టిడిపి మండల ఉపాధ్యక్షులు పేరిచర్ల బాలరాజు, కూనపరాజు రామరాజు, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'కూటమి'లో పొలి'ట్రిక్స్'..!

టిడిపి, జనసేన నేతల మధ్య వార్

ఆధిపత్యం కోసం ఇరుపార్టీల నేతలు తహతహ

పలుచోట్ల రోడ్డెక్కిన జనసేన నాయకులు

పదవులు, మద్యం షాపుల కోసం రచ్చరచ్చ

స్థానిక సంస్థల ఎన్నికలు వస్తే బండారం బట్టబయలు



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి కూటమిలో పొలిటికల్ వార్ రోజురోజుకీ ముదురుతోంది. టిడిపి, జనసేన నాయకులు బహిరంగంగానే నువ్వా.. నేనా అన్నట్లు తలపడుతున్నారు. టిడిపి, జనసేన నాయకుల మధ్య అసలు పొసగని పరిస్థితి ఉంది. రాజకీయంగా పైచేయి సాధించేందుకు ఇరుపార్టీల నేతలు పోటీ పడుతున్నారు. గడిచిన కొద్దిరోజులుగా ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో చోటుచేసుకుంటున్న పరిణామాలు అందుకు అద్దం పడుతున్నాయి. దెందులూరు, చింతలపూడి వంటి నియోజకవర్గాల్లో జనసేన నాయకులు రోడ్డెక్కిన పరిస్థితి ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఇన్‌ఛార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమక్షంలోనే ఇరుపార్టీల నేతలు విమర్శలకు దిగిన పరిస్థితి. రెండు జిల్లాల్లో 14 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. గడిచిన ఎన్నికల్లో టిడిపి కూటమి క్లీన్‌స్వీప్ చేసింది. నరసాపురం, భీమవరం, తాడేపల్లిగూడెం, ఉంగుటూరు, పోలవరంలో జనసేన అభ్యర్థులు గెలిచారు. కైకలూరులో బిజెపి గెలవగా మిగిలిన ఎనిమిది స్థానాల్లోనూ టిడిపి ఎంఎల్‌ఎలు ఉన్నారు. జనసేన ఎంఎల్‌ఎలు ఉన్నచోట టిడిపి నేతలు తమను పట్టించుకోవడం లేదని గగ్గోలు పెడుతున్నారు. టిడిపి ఎంఎల్‌ఎలు ఉన్నచోట తమను పట్టించుకోవడం లేదని జనసేన నేతలు చెబుతున్నారు. తమకు గౌరవం ఇవ్వడం లేదని బిజెపి నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లిగూడెంలో జనసేన ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ తమను పట్టించుకోవడం లేదని టిడిపి తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి వలవల బాబ్జి ఇన్‌ఛార్జి మంత్రి వద్ద గగ్గోలు పెట్టారు. ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు తమను పట్టించుకోవడం లేదని జనసేన నాయకులు ఫిర్యాదు చేశారు. దెందులూరు ఎంఎల్‌ఎ చింతమనేని ప్రభాకర్ జనసేన నాయకులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారంటూ ఆ పార్టీ నాయకులు కలెక్టరేట్ వద్ద ఆందోళన సైతం నిర్వహించారు. చింతలపూడి నియోజకవర్గంలోనూ అదే పరిస్థితి ఉంది. పోలవరం నియోజకవర్గంలో టిడిపి నాయకులకు గౌరవం ఇవ్వడం లేదంటూ అసంతృప్తి వ్యక్తం చేస్తున్న పరిస్థితి ఉంది. ప్రతి నియోజకవర్గంలోనూ టిడిపి, జనసేన, బిజెపి నాయకుల మధ్య పొలిటికల్ వార్ సాగుతోంది. పనుల విషయంలో అధికారులపై ఇరుపార్టీల నేతలు తీవ్రమైన ఒత్తిడి తేవడంతో అధికారులకు ఏంచేయాలో తెలియని పరిస్థితి ఉంది. అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లో ఇటువంటి పరిస్థితి ఉంటే ముందుముందు ఎలా ఉంటుందోననే చర్చ సర్వత్రా సాగుతోంది.

స్థానిక పదవులు, మద్యం షాపులపై రగడ

కూటమి నేతల్లో ముఖ్యంగా పదవులు, మద్యం షాపులపై తీవ్ర ఘర్షణలు సాగుతున్నాయి. సాగునీటి సంఘాల ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైంది. వాటర్ యూజర్స్ అసోసియేషన్ కమిటీల ఎన్నికలు జరగనున్నాయి. గ్రామాల్లో సాగునీటి సంఘ సభ్యులకు మంచి గుర్తింపు ఉంటుంది. దీంతో సాగునీటి సంఘాల పదవులపై జనసేన, టిడిపిలో తీవ్రపోటీ నెలకొంది. పదవులు తమకు కేటాయించకపోతే పోటీకి దిగుతామని జనసేన నేతలు పలుచోట్ల రెడీ అవుతున్నారు. గ్రామాల్లో చేయాల్సిన పనులకు సంబంధించి సైతం కూటమి పార్టీల్లో పోటీ నెలకొంది. ముఖ్యంగా మద్యం దుకాణాల విషయంలో గొడవలు తారాస్థాయికి చేరాయి. ఆయా పార్టీల నేతలు ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఘర్షణలు పడిన పరిస్థితి ఉంది. బెల్టుషాపుల ఏర్పాటులోనూ కూటమిలో ఇప్పటికీ రగడ సాగుతూనే ఉంది. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి, జనసేన మధ్య రాజకీయ యుద్ధం మరింత తారాస్థాయికి చేరే అవకాశం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇరుపార్టీల నాయకులు ఆర్థికంగా బలపడేందుకు మట్టి, ఇసుక వంటివాటిపై ఆధిపత్యం చెలాయించేందుకు చూస్తున్నారు. ఇటీవల జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ హోమ్ మంత్రి పనితీరుపై బహిరంగంగానే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో దిగువస్థాయిలో జనసేన నేతలు దీని అస్త్రంగా చేసుకుని టిడిపి నేతలపై విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో కూటమిలో పొలిటికల్ వార్ ఏస్థాయికి చేరుతుందో వేచిచూడాలి.

ఉపాధ్యాయ ఎంఎల్‌సికి 16,316 ఓటర్లు

రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తంగా 16,316 మంది ఓటర్లు నమోదయ్యారు. తుది ఓటర్ల జాబితాను ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ సిగిలి బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. టీచర్ ఎంఎల్‌సికి సంబంధించిన తుది ఓటర్ల జాబితాను ప్రచురించామన్నారు. ఈ జాబితాకు సంబంధించి నియోజకవర్గ పరిధిలోని కలెక్టర్ కార్యాలయాలు, సబ్ కలెక్టర్ కార్యాలయాలు, ఆర్‌డిఒ కార్యాలయాలు, తహశీల్దార్, ఎంపిడిఒ, మున్సిపల్, ఎంఇఒ, పోలింగ్ స్టేషన్లలో బుధవారం నుంచి హార్డ్ కాపీ, సాఫ్ట్ కాపీని అందుబాటులో ఉంచుతామన్నారు.

ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని 113 మండలాల్లో మొత్తంగా 16,316 మంది ఓటర్లు ఉన్నారన్నారు. అందులో పురుషులు 9,674 మంది, స్త్రీలు 6,642 మంది ఉన్నారని తెలిపారు. 116 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 11 మండలాల్లో 12 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని 614 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలోని 19 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,893 మంది ఓటర్లు, ఏలూరు జిల్లాలోని 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 2,605 మంది ఓటర్లు, కాకినాడ జిల్లాలోని 21 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు 3,333 మంది ఓటర్లు, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని 22 మండలాల్లో 22 పోలింగ్ కేంద్రాలు, 3,209 మంది ఓటర్లు, పశ్చిమగోదావరి జిల్లాలోని 20 మండలాల్లో 20 పోలింగ్ కేంద్రాలు 3,662 మంది ఓటర్లు ఉన్నారని ఆయన తెలిపారు.

11 నుంచి నామినేషన్లు స్వీకరణ

టీచర్స్ ఎంఎల్‌సికి సంబంధించి ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకూ కాకినాడ కలెక్టర్ కార్యాలయంలోని కోర్టు హాల్లో నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఆయా తేదీల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. ఈ ఎన్నికకు సంబంధించి కాకినాడ జిల్లా కలెక్టర్ రిటర్నింగ్ అధికారి ఉంటారని, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల డిఆర్‌ఒలు అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లుగా వ్యవహరిస్తారని తెలిపారు.



మాట్లాడుతున్న కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్

23 వరకూ గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఓటర్ల నమోదు

ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లా గ్రాడ్యుయేట్ ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు గడువును ఈ నెల 23 వరకూ పెంచారన్నారు. ఈ నెల 6తో గడువు ముగిసిందని, దీనికి సంబంధించి 23న డ్రాఫ్ట్ పబ్లికేషన్ వస్తుందన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి 23 వరకూ ఓటరుగా నమోదు చేసుకున్న వారి పేర్లు డిసెంబర్ 30న ప్రచురించే ఫైనల్ పబ్లికేషన్‌లో కనిపిస్తాయని తెలిపారు. ఎవరైనా ఓటు నమోదు చేసుకోకపోతే ఈ నెల 23లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2024 నవంబర్ ఒకటో తేదీకి మూడు సంవత్సరాల ముందు డిగ్రీ పూర్తి చేసిన వారు గ్రాడ్యుయేట్ ఓటర్లుగా నమోదు చేసుకోవచ్చన్నారు. 15 సంవత్సరాల స్టడీ కంప్లీట్ చేసి ఉండాలని ఆయన తెలిపారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో ఇప్పటివరకు 1,74,772 మంది ఓటర్లుగా నమోదయ్యారని తెలిపారు. దీనికి సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లాలో 12 పోలింగ్ కేంద్రాలు, తూర్పుగోదావరి జిల్లాలో 61 పోలింగ్ కేంద్రాలు , ఏలూరు జిల్లాలో 45 పోలింగ్ కేంద్రాలు, కాకినాడ జిల్లాలో 63 పోలింగ్ కేంద్రాలు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 53 పోలింగ్ కేంద్రాలు, పశ్చిమగోదావరి జిల్లాలో 65 పోలింగ్ కేంద్రాలు మొత్తం 299 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశంలో కాకినాడ డిఆర్‌ఒ జె.వెంకట్రావు, ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో ఐటి దాడుల కలకలం

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భీమవరం మాజీ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ నివాసం, వ్యాపార సముదాయాల్లో ఆదాయపు పన్నుల శాఖ అధికారులు బుధవారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. భీమవరంలో నివాసం, వ్యాపార సముదాయాలతోపాటు కృష్ణా జిల్లా నాగాయలంకలోని వ్యాపార సముదాయంలో ఐటి అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఐటి ప్రత్యేక బృందాలు కేంద్ర బలగాల పహరా మధ్య సోదాలు చేస్తున్నారు. నివాసం, వ్యాపార సముదాయాల నుంచి లోపలి వారిని బయటకు, అదేవిధంగా బయట నుంచి ఎవ్వరినీ లోపలికి రాకుండా కట్టుదిట్టంగా సోదాలు చేస్తున్నారు. ఐటి అధికారుల బృందం వచ్చే సమయానికి ముందే మాజీ ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ ఉదయమే హైదరాబాద్ బయలుదేరి వెళ్లినట్లు తెలిసింది. రాజకీయ నేతగా, ఆక్వా ఎక్స్‌పోర్టర్‌గా ఈ ప్రాంతంలో గ్రంధి శ్రీనివాస్‌కు పేరుంది. ఎన్నడూ లేనివిధంగా తొలిసారి ఆయన నివాసం, వ్యాపార సముదాయాలపై ఐటి దాడులు జరగడంపై పలు ప్రచారాలు సాగుతున్నాయి.



గ్రంధి శ్రీనివాస్ నివాసం వద్ద గస్తీకాస్తున్న సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్

ఏలూరు స్పోర్ట్స్ : ఆదాయపు పన్ను శాఖాధికారుల సోదాలతో నగరం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. నగరానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త నూకల రామకృష్ణ ఇంటికి సెంట్రల్ ఐటి అధికారులు బుధవారం ఉదయం 11 గంటలకు చేరుకుని తనిఖీలు చేపట్టారు అయితే అధికారులు స్థానిక పోలీసుల సహకారం తీసుకోలేదు. సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది సహకారంతోనే ఈ తనిఖీలు చేపట్టడం గమనార్హం. ఈ తనిఖీ బృందానికి ఎస్‌పి స్థాయి అధికారి నేతృత్వం వహిస్తున్నారు. అయితే నూకల రామకృష్ణ స్థానికంగా ఒక బ్యాంకును కూడా నిర్వహిస్తున్నారు. నాగ హనుమాన్ ఆయిల్ పేరుతో ఆయన నూనె వ్యాపారం చేస్తున్నారు. దీంతోపాటు ఆయనకు రైస్ మిల్లులు, ఐస్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. ప్రస్తుతం రామకృష్ణ అందుబాటులో లేకపోవడంతో ఆయన కుమారుడు సమక్షంలో ఐటి అధికారులు వంటనూనె ఫ్యాక్టరీకి సంబంధించిన వివరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే దీనికి సంబంధించి తనిఖీ అధికారులు అధికారికంగా ఇప్పటి వరకూ ఏమీ ప్రకటించలేదు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి

ఉండి, గణపవరం మండలాల్లో విషాదఛాయలు

ప్రజాశక్తి - ఉండి

ఉండి మండలం లోని ఉణుదుర్రు జెడ్‌పి హైస్కూల్లో ప్రధానో పాధ్యాయుడు తోట రత్నకుమార్ (57) ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలంలో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల శిక్షణా తరగతుల్లో బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో ఆకస్మికంగా మృతి చెందారు. రత్నకుమార్ భార్య చంద్రకళ అదే పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలిగా పని చేస్తున్నారు. రత్నకుమార్ స్వగ్రామం గణపవరం మండలం కేశవరం. చంద్రకళ స్వగ్రామం ఉండి మండలం ఉణుదుర్రు. మృతునికి కుమారుడు, కుమార్తె ఉన్నారని ఎంఇఒ-2 బొక్కా వినాయకుడు తెలిపారు. రత్నకుమార్ కుమారుడు ఐఐటి ఖరగ్‌పూర్‌లో విద్యాభ్యాసం చేసి పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతుండగా, కుమార్తె విజయవాడలోని ఒక కళాశాలలో బిఎస్‌సి అగ్రికల్చరల్ చదువుతున్నట్లు ఆయన తెలిపారు. సహచర ఉపాధ్యాయుడు గుండెపోటుతో మరణించడం తమను వేదనకు గురి చేసిందని ఉణుదుర్రు పాఠశాల ఉపాధ్యాయులు సోమరాజు తెలిపారు.



రత్నకుమార్ (ఫైల్‌ఫొటో)

కరెంటు తీసేసి ఇళ్లు కూల్చడం అన్యాయం

ఉండి ఎంఎల్‌ఎ రఘురామకృష్ణంరాజు చర్యలు సరికాదు - వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - భీమవరం

ఆకివీడు మండలం ఐ.భీమవరంలో పేదల ఇళ్లకు కరెంటు తీసేసి పొక్లెయిన్లతో కూల్చడం అన్యాయమని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు విమర్శించారు. ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు దుర్మార్గపు చర్యలు మానుకోవాలని హెచ్చరించారు. ఆ సంఘం జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు పక్కన అనేక ఏళ్ల నుండి నివశిస్తున్న పేదలకు ఎటువంటి సౌకర్యాలూ కల్పించకుండా ఇళ్లు ఖాళీ చేయించడం ఎంఎల్‌ఎకు తగదన్నారు. జిల్లాలో వ్యవసాయ రంగంపై ఆధారపడిన కూలీలకు ఉపాధి హామీ పనులు కీలకంగా మారాయన్నారు. పని కావాలని అడిగిన ప్రతి వ్యవసాయ కార్మికునికీ పనులు కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కంకిపాడులో పల్లె పండగ ప్రారంభ సభలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చెప్పినట్లుగా పని చేసిన వారికి రూ.15 రోజుల్లో వేతనం ఇవ్వాలన్నారు. పని చూపకపోతే భృతి అయినా ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ఉపాధి హామీ నిధులతో జరిగే పనుల్లో 60 శాతం కూలీలతో పని చేయించాలని, 40 శాతమే మెటీరియల్‌కు ఖర్చు చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కౌరు పెద్దిరాజు, కండెల్లి సోమరాజు, శేషపు అశ్రియ్య, సహాయ కార్యదర్శి బల్ల చినవీరభద్రరావు, యడ్ల చిట్టిబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ఉచిత ఇసుక అమలుకు చర్యలు వేగవంతం

అందుబాటులోకి మూడు రీచ్‌లు - జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఇసుక వినియోగదారులు సులభంగా ఇసుక పొందేందుకు ఏర్పాట్లను పూర్తి చేశామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేకపోవడంతో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు డివిజన్‌లోని తీపర్రు-2, 3, ఔరంగాబాద్ ఇసుక రీచ్‌ల నుండి నేరుగాగాని, ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునిగాని ఉచిత ఇసుక పొందేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. వినియోగదారుడు లోడింగ్ ఛార్జీలు, రవాణా ఛార్జీలు చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. వినియోగదారుడు ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకున్న సందర్భంలో ఇసుక సంబంధిత వినియోగదారునికి చేరకపోయినా, ఏమైనా సందేహాలున్నా వెంటనే జిల్లా కలెక్టరేట్‌లోని ఇసుక ఫెసిలిటేషన్ సెంటర్ నెంబర్లకు 9391445753, 86682 91997, 8186939223, 9550175144 తెలియజేయాలన్నారు. ఇసుకను అక్రమ మార్గంలో తరలించి సొమ్ము చేసుకుంటే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. పెండ్యాల నుండి ఇసుకను పొందేందుకు కూడా అవకాశం ఉందని, పెండ్యాలకు దగ్గరగా ఉన్నవారు ట్రాక్టర్లు ద్వారా ఇసుకను పొందవచ్చని కలెక్టర్ సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

విఒఎల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నాలు




తణుకు : సిసి బంగారయ్యకు వినతిపత్రాన్ని అందజేస్తున్న విఒఎలు

ప్రజాశక్తి - తణుకు


విఒఎల కాలపరిమితి సర్క్యూలర్ రద్దు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఎపి వెలుగు విఒఎ (యానిమేటర్స్) ఉద్యోగుల సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో డ్వాక్రా భవనం వద్ద ధర్నా నిర్వహించి, సిసి డి.బంగారయ్యకు వినతిపత్రం అందజేశారు. ఎనిమిది నెలల వేతన బకాయిలు చెల్లించాలని, అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, మహిళా మార్టుల్లో బలవంతపు సరుకుల కొనుగోలు ఆపాలని, నిబంధనలకు విరుద్ధంగా విఒఎలను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ రాష్ట్రంలో 28 వేల మంది విఒఎలు పొదుపు సంఘాల మహిళలకు దీర్ఘకాలంగా సేవలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం మూడేళ్లు విఒఎలుగా పని చేసినటువంటి వారిని తొలగించి వారి స్థానంలో కొత్త వారిని తీసుకోవాలని 2019 నవంబర్‌లో సర్క్యూలర్ జారీ చేశారని తెలిపారు. సర్క్యూలర్‌ను రద్దు చేసి విఒఎల ఉపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజేశ్వరి, ఎ.పార్వతి, పి.దీప్తి, ఎస్.పార్వతి, డి.దేవి, షేక్ ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

నరసాపురం : విఒఎ మూడేళ్ల కాలపరిమితి సర్క్యూలర్ రద్దుచేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తెలగంశెట్టి సత్యనారాయణ అన్నారు. నరసాపురం వెలుగు కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఎపి వెలుగు విఒఎల సంఘం ఆధ్వర్యంలో విఒఎలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా విఒఎలను తొలగిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా మార్టుల్లో బలవంతపు సరుకుల కొనుగోలు ఆపాలన్నారు. కూటమి ప్రభుత్వం కాలపరిమితి సర్క్యూలర్ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిందని, సర్క్యూలర్‌ను రద్దు చేసి విఒఎల ఉపాధిని కాపాడాలన్నారు. అనంతరం ఎపిఎం జక్కంపూడి నాయుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కె.దుర్గ, జి.స్వాతి, ఎం.స్వర్ణలత, ఎం.బాలా త్రిపుర సుందరి, జె.గీత, పి.పద్మావతి, టి.సుజాత, ఎస్.వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



నరసాపురంలో..

పెనుగొండ : విఒఎలకు వేతన బకాయిలు చెల్లించాలని, అక్రమంగా తొలగించిన వారిని తిరిగి విధుల్లోకి తెలుసుకోవాలని కోరుతూ పెనుగొండ వెలుగు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎపిఎం పుష్పకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఒఎ మండల కార్యదర్శి చెన్నం అనూరాధ మాట్లాడుతూ విఒఎల ఉపాధిని దెబ్బతీసే మూడేళ్ల కాలపరిమితి సర్క్యూలర్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. టిడిపి ప్రభుత్వం కాలపరిమితి సర్క్యూలర్ రద్దు చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. సిఐటియు మండల అధ్యక్షులు నాగిశెట్టి గంగారావు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.ఆంజనేయులు, విఒఎ సంఘం నాయకురాలు ఎస్.శేషారత్నం, లక్ష్మీకుమారి, జి.లక్ష్మి పాల్గొన్నారు.



పెనుగొండలో..

రిటైర్డ్ ఉద్యోగులను తీసుకోవడం తగదు

డివైఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి - ఆకివీడు

రైల్వే ఉద్యోగులుగా రిటైర్డ్ ఉద్యోగులను తిరిగి తీసుకోవడం దారుణమని, ఇది ఎంతమాత్రం తగదని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గేదెల ధనుష్ అన్నారు. కాంట్రాక్టు ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ఉద్యోగాల్లో రిటైర్డ్ సిబ్బందిని రీఎంగేజ్‌మెంట్ చేయాలని భారతీయ రైల్వే ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ మేరకు డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక రైల్వే స్టేషన్‌మాస్టర్ సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల రీఎంగేజ్‌మెంట్ విధానం మన యువత సామర్థ్యాన్ని బలహీనపరిచే విధంగా ఉందన్నారు. ఏడాదికి రెండు కోట్లు ఉద్యోగాలు ఇస్తానన్న ప్రధాని మోడీ అందుకు భిన్నంగా యువత భవిష్యత్తును నిర్వీర్యం చేయడం దుర్మార్గమన్నారు. తక్షణమే రీఎంగేజ్‌మెంట్ ఆలోచనను వెనక్కి తీసుకొని రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులన్నింటికీ నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నేతలు కళ్యాణ్, గణేష్ ,వెంకటేష్, సాయి ఫణి, కార్తీక్, లోకేష్ పాల్గొన్నారు.



రైల్వే మేనేజర్ సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధనుష్, పట్టణ కమిటీ సభ్యులు

ప్రసాద్ కుటుంబానికి జనసేన సాయం

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని దర్భరేవు గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మేడిది ప్రసాద్ మరణించారు. బుధవారం వారి కుటుంబ సభ్యులను జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి మురళీకృష్ణ (చిన్నా) పరామర్శించి రూ.10,000 ఆర్థిక సాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున సాయం అందేలా కృషి చేస్తానని మురళీకృష్ణ హామీ ఇచ్చారు.

మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు జరపాలి

డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - భీమవరం


మండల స్థాయిలోనే శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని డిటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు టి.రత్నకుమార్ ఆగిరిపల్లిలో శిక్షణలో ఉండగా పని ఒత్తిడితో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. ఆయన మృతి పట్ల డిటిఎఫ్ జిల్లా శాఖ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. రెసిడెన్షియల్ విధానంలో కాకుండా సరైన వసతులు లేక ఉపాధ్యాయుడు మరణించారని తెలిపారు. దీనికి ప్రభుత్వం బాధ్యత వహించి రూ.కోటి నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జరిగే శిక్షణలను నాన్ రెసిడెన్షియల్ విధానంలో మండల స్థాయిలో జరపాలని డిమాండ్ చేశారు.

ఆన్‌లైన్‌లో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వండి

ప్రజాశక్తి - ఉండి

ఇక నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పివిఎస్.రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల్లో పాల్గొన్న ఉండి మండలం ఉణుదుర్రు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోట కుమార్ గుండెపోటుతో మృతి చెందారన్నారు. అనారోగ్యంగా ఉన్న ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించడంలో చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. తోట కుమార్ కుటుంబానికి ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. శిక్షణ తరగతుల్లో ఉపాధ్యాయులకు మౌలిక వసతులు కల్పించాలని ఆయన కోరారు.

తణుకు : ఉపాధ్యాయుల రెసిడెన్షియల్ శిక్షణ తరగతులను ఆపి జిల్లాల్లోని ముఖ్య పట్టణ కేంద్రాల్లోనే నాన్ రెసిడెన్షియల్ విధానంలో నిర్వహించాలని స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఎపి జాకబ్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖాధికారులు చేసిన విన్నపాన్ని పెడచెవిన పెట్టిన కారణంగానే ఆగిరిపల్లి హిల్ స్కూల్ లీడర్‌షిప్ ట్రెయినింగ్‌లో ఉణుదుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్ ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు తోట రత్నకుమార్ గుండెపోటుతో మరణించడం విచారకరమని పేర్కొన్నారు. ఎస్‌పిడి ఇక నుంచి శిక్షణ తరగతులు జిల్లా కేంద్రాల్లో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించాలని చెప్పడం చేతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్న చందంగా ఉందని జాకబ్‌బాబు విమర్శించారు. రత్నకుమార్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.


పురస్కారం అందుకుంటున్న బంగారయ్య

బంగారయ్యకు పురస్కారం

ప్రజాశక్తి - ఆకివీడు

సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు బొబ్బిలి బంగారయ్య సేవలకు గాను పురస్కారం లభించింది. బుధవారం జిల్లా కలెక్టర్ నుంచి పురస్కారం లభించింది. బుధవారం భీమవరంలోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో వృద్ధుల సంక్షేమ సంఘాల ద్వారా వృద్ధులకు సేవలందిస్తున్నందుకు గాను ఆయనకు ఈ పురస్కారం లభించిందని తెలిపారు.

యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శిగా నారాయణ

ప్రజాశక్తి - ఆకివీడు



యుటిఎఫ్ ఆకివీడు మండల నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. యుటిఎఫ్ మండల నూతన ప్రధాన కార్యదర్శిగా ఆర్‌విఎస్ నారాయణ (విక్రమ్) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్షులుగా జెడ్‌వి సత్యనారాయణ, ట్రెజరర్‌గా జిల్లా వెంకటేశ్వరరావు, సహాయాధ్యక్షులుగా ముత్యాల వెంకటస్వామి ఎన్నికయ్యారు.


డ్రెయిన్లో వలకట్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ దాసి రాజు

గొంతేరు డ్రెయిన్‌లో వలకట్ల పరిశీలన

ప్రజాశక్తి - మొగల్తూరు

కాళీపట్నం తూర్పు పంచాయతీ గొంతేరు డ్రెయిన్‌లో ఏర్పాటు చేసిన వలకట్లను ఆర్‌డిఒ దాసి రాజు బుధవారం సందర్శించారు. భీమవరంలోని కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా వినతుల పరిష్కార వేధికలో పలువురు వలకట్లపై ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారంలో భాగంగా ఆయన వలకట్లను పరిశీలించారు. ఆయన వెంట తహశీల్దార్ కె.రాజు కిషోర్, ఇన్‌ఛార్జి ఆర్‌ఐ ముచ్చర్ల నిరంజన్, సిబ్బంది ఉన్నారు.

రేషన్ షాపుల్లో తహశీల్దార్ తనిఖీ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని పలు రేషన్ షాపులను తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో అలసత్వం చేస్తే సహించేది లేదన్నారు. అనంతరం సరుకులను ఇంటింటికీ అందించే వాహనాన్ని పరిశీలించారు. బియ్యం, కందిపప్పు, పంచదార నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ, ఇన్‌ఛార్జి ఆర్‌ఐ మిరియాల లక్ష్మీనారాయణ, విఆర్‌ఒలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నక్కావారిపాలెంలో క్షుద్ర పూజల కలకలం

ప్రజాశక్తి - మొగల్తూరు

క్షుద్ర పూజలు కలకలంతో జనం భయాందోళన చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మొగల్తూరు పంచాయతీ నక్కావారిపాలెం సమీపంలో గుండు మాణిక్యాలరావు చెరువు వద్ద బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు క్షుద్ర పూజల పేరుతో పసుపు, కుంకుమ, అన్నం ముద్దలు, నిమ్మకాయలు బొగ్గులు, కోడిగుడ్డు, నల్ల కోడి పెట్టలు తదితర వాటిని నాలుగు రోడ్ల జంక్షన్‌లో పెట్టి ప్రజలను భయాందోళన గురిచేశాయి. దీంతో నక్కవారిపాలెం, గొల్లగూడెం, ఇంజేటివారిపాలెం, పడమటిపాలెం గ్రామాలకు వెళ్లే ప్రధాన కూడలిలో క్షుద్ర పూజలు చేయడంతో ఉదయమే విద్యార్థులు, మార్కెట్‌కు వెళ్లే వారు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. అదేవిధంగా ఇటీవల మొగల్తూరు 216 జాతీయ రహదారిపై క్షుద్ర పూజలు చేసి దుండుగులు కలకలం సృష్టించారు. మళ్లీ పూజలు చేయడంతో ఈ ప్రాంతవాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

కృషితోనే లక్ష్య సాధన

ప్రజాశక్తి - నరసాపురం

కృషి, పట్టుదలతోనే లక్ష్యాన్ని చేరుకోగలమని ఎన్ స్మైల్స్ సంస్థ సిఇఒ తేజు తెలిపారు. స్థానిక వైఎన్ కళాశాల ఐక్యుఎసి సెంటర్ ఆధ్వర్యంలో 'సంతోషానికి దోహదం చేసే మూల సూత్రాలు మన పాత్ర' అనే అంశంపై అధ్యాపకులకు, విద్యార్థులకు రెండు రోజులపాటు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌నకు బెంగుళూరుకు చెందిన ఎన్ స్మైల్స్ సంస్థ సిఇఒ తేజు ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రసంగించారు. మనం ఆనందంగా ఉండాలంటే మన లక్ష్యాలను బలంగా నిర్ణయించుకొని వాటిని సాధించినప్పుడు మాత్రమే మనకు సంతోషం, ఆనందం లభిస్తాయని, అందుకు గాను నిరంతరం కృషి చేయాల్సి ఉంటుందన్నారు. ఇతరులను విమర్శించకుండా ఉండడంలో, ఇతరుల నుంచి సహాయం పొందితే వారి పట్ల కృతజ్ఞత కలిగి ఉండడంలోనే సంతోషం అనే మూల సూత్రాలు దాగి ఉన్నాయన్నారు. సంతోషంగా ఉండి పని చేసినప్పుడు మాత్రమే ఫలితం అనుకూలంగా వస్తుందన్నారు. ఈ వర్క్ షాప్‌కు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు, ప్రిన్సిపల్ చింతపల్లి కనకారావు, పీజీ డైరెక్టర్ నిమ్మల చింతారావు, కళాశాల డీన్ గంధం శ్రీరామకృష్ణ పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న తేజు


కార్మికులతో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - పెనుగొండ

టెండర్ పేరుతో గ్రామ పంచాయతీల్లో అక్రమ తొలగింపులు పెరుగుతున్నాయని, టెండర్ విధానం రద్దు చేయాలని సిఐటియు జిల్లా నాయకుడు ఎం.ఆంజనేయులు అన్నారు. బుధవారం పెనుగొండలో గ్రామ పంచాయతీ కార్మికులతో మాట్లాడుతూ పెనుగొండ పంచాయతీలో కార్మికుల నుంచి టెండర్ పేరుతో రూ.వెయ్యి వసూలు చేస్తున్నారని, చిన్న పంచాయతీల్లో రూ.500 వసూలు చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని కోరారు. కనీస వేతనాలు అమలు చేయాలని కోరినా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం టెండర్ విధానాన్ని రద్దుచేసి కార్మికులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రతి నెలా సబ్బులు, కొబ్బరి నూనె, ప్రతి సంవత్సరం రెండు జతల చెప్పులు, రెండు జతల యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు నాగిశెట్టి గంగారావు, కార్మికులు బంగారు విజయ, నీలాపు గంగ పాల్గొన్నారు.


విజేతలను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

ఎస్‌కెఎస్‌డి విద్యార్థినుల హవా

ప్రజాశక్తి - తణుకు

ఈ నెల 2, 3వ తేదీల్లో పిఆర్.గవర్నమెంట్ కాలేజ్ (అటానమస్) కాకినాడలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరిగిన కబడ్డీ (ఉమెన్) ఇంటర్ కాలేజీయేట్ కమ్ యూనివర్సిటీ సెలక్షన్స్‌లో ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల విద్యార్థినులు నాలుగో స్థానాన్ని గెలుచుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ కెప్టెన్ యుఎల్.సుందరీబాయ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదికవి నన్నయ యూనివర్సిటీ తరపున అలగప్పా యూనివర్సిటీ కరైకూడిలో నవంబర్ 26 నుంచి 30వ తేదీ వరకూ సౌత్‌జోన్ కబడ్డీ ఇంటర్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొనేందుకు కళాశాల విద్యార్థిని బి.హారిక ఎంపికైందని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకట కృష్ణారావు విజేతలను అభినందించారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ ఎం.రత్నకుమారి పాల్గొన్నారు.

పథకాల అమలుకు సహకరించాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ పథకాలను జనంలోకి తీసుకువెళ్లి వాటి అమలుకు సహకరించాలని తహశీల్దార్ కె.రాజు కిషోర్ అధికారులకు సూచించారు. మొగల్తూరులో ప్రతి బుధవారం నిర్వహించే మండల స్థాయి అధికారుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పలు అంశాలపై వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - పాలకొల్లు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి

స్థానిక ఎఎస్‌ఎన్‌ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 1, 2, కళాశాల యాంటీ డ్రగ్ కమిటీ, నెహ్రూ యువజన కేంద్రం ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ సంరక్షణ - మొక్కలు నాటడంపై వ్యాసరచన పోటీలు, యాంటీ డ్రగ్ అవేర్నెస్‌పై పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అధ్యక్షత వహించి మాట్లాడారు. యువత మాదకద్రవ్యాలు తీసుకోవడం వల్ల మహిళల పట్ల అసభ్యకరమైన ప్రవర్తనను ప్రస్తుతం చాలా చోట్ల చూడడం జరుగుతోందన్నారు. ఈ ధోరణిని విడనాడాలని కోరారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవడం ద్వారా గాలిలో ఆక్సిజన్ శాతాన్ని పెంచడం ద్వారా ఓజోన్ విచ్ఛిన్నత తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం ఏలూరు వాలంటీర్ కె.రాజేష్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టి.కృష్ణ, ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ టు కోఆర్డినేటర్ ఎం.రామకృష్ణ, కళాశాల ఆంటీ డ్రగ్ కమిటీ కన్వీనర్ ఎ.వంశీ సుబ్బరాయన్ పాల్గొన్నారు.

వార్డులో మున్సిపల్ కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - నరసాపురం


పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పట్టణంలోని 16వ వార్డులో పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పట్టణ పరిధిలోని ప్రతి వార్డులో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పారిశుధ్యం లోపిస్తే అంటురోగాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. దోమలు నిర్మూలన కోసం తగు చర్యలు తీసుకోవాలని శానిటరీ సిబ్బందిని ఆదేశించారు.

రుస్తుంబాదలో 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలోని రుస్తుంబాద రైతు సేవా కేంద్రాల పరిధిలో సర్పంచి బందెల భారతి రవీంద్ర అధ్యక్షతన బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఇ.అనిల్‌కుమారి మాట్లాడుతూ వరిలో మేలైన యజమాన్య పద్ధతులు అవగాహన కల్పించారు. వ్యవసాయ అధికారి శామ్యూల్ జాన్సన్ మాట్లాడుతూ వరిలో ఎరువుల యజమాన్యం, ధాన్యం కొనుగోలు కేంద్రాలపై వివరించారు. రైతులు మాట్లాడుతూ రుస్తుంబాద మురుగు కాలువ సమస్యను పరిష్కరించాలని, అలాగే రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, జింకు జిప్సమ్ అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఎఎ.శ్రీనివాసదొర, యడ్లపల్లి అర్జునుడు, కృష్ణ నరసింహ, కంబాల వెంకన్న నాయుడు, సింగులూరి వెంకన్న నాయుడు, సిరిగినీడి వెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.

'టిడిపి సభ్యత్వ నమోదుకు గర్విస్తున్నాం'

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు నియోజకవర్గ అభివృద్ధి 2014-19 మధ్య దూసుకుపోగా, గత 5 సంవత్సరాల్లో కుంటుపడిందని అందుకే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రామానాయుడు అత్యధిక మెజార్టీతో విజయం సాధించారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి పెచ్చెట్టి బాబు అన్నారు. స్థానిక 9వ వార్డులో టిడిపి సభ్యత్వ నమోదు కార్యక్రమం 4వ క్లస్టర్ ఇన్‌ఛార్జి గండేటి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా 5వ క్లస్టర్ ఇన్‌ఛార్జి పి.బాబు, నియోజకవర్గ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి విచ్చేశారు. 9వ వార్డు అధ్యక్ష కార్యదర్శులు మీసాల రాము, బీర సత్తిబాబు, సిరియాలా సాయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ రామానాయుడు వల్లే పాలకొల్లులో అభివృద్ధి జరిగిందని, టిడిపి సభ్యత్వం తీసుకోడానికి గర్విస్తున్నామని తెలిపారు.

టెన్నిస్ పోటీల్లో గణపవరం విద్యార్థుల హవా

ప్రజాశక్తి - గణపవరం

ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీల్లో పెనుగొండ ఎస్‌కెవిపి డిగ్రీ కాలేజీలో జరిగిన పోటీల్లో గణపవరం డిగ్రీ కాలేజీ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించినట్లు కాలేజీ ప్రిన్సిపల్ పి.నిర్మలాకుమారి బుధవారం తెలిపారు. కాలేజీకి చెందిన విద్యార్థి అంజన్ కుమార్ యూనివర్సిటీ పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపల్ వై.మధురాజు, కళాశాల పిడి ఎ.స్వాతి, లెక్చరర్లు గణేష్, అధ్యాపకులు, కాలేజీ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేటెడ్ పదవుల కేటాయింపులో దేవాంగులకు అన్యాయం

ప్రజాశక్తి - పెనుమంట్ర

నామినేటెడ్ పదవుల నియామకంలో దేవాంగులకు తీరని అన్యాయం జరిగిందని దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి రొబ్బి భాస్కరరావు అన్నారు. బుధవారం మార్టేరు దేవాంగ కమ్యూనిటీ హాల్లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చేనేత జనాభాలో 16 లక్షల జనాభా కలిగి ఉన్న దేవాంగులకు నామినేటెడ్ పదవుల్లో తీవ్ర అన్యాయం జరిగిందని, కేవలం ఒకే ఒక చేనేత వర్గానికే పదవులు ఇచ్చి, మిగిలిన వారికి ఒక్క నామినేటెడ్ పదవి కూడా ఇవ్వలేదని వాపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమపై దృష్టి సారించి నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని కోరుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో చేతి వృత్తుల జిల్లా అధ్యక్షుడు అల్లాడ సూర్య భాస్కర్‌రావు, దేవాంగ సంక్షేమ సంఘం వైస్ ప్రెసిడెంట్ బల్ల మాసరయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు అల్లాడ రామకృష్ణ, వట్టం లక్ష్మణ్ పాల్గొన్నారు.


ఛాంబర్స్ కళాశాలలో కెరీర్ గైడెన్స్ పై సెమినార్

ప్రజాశక్తి - పాలకొల్లు

స్థానిక ఛాంబర్స్ కళాశాలలో 'కెరీర్ కనెక్ట్' అనే అంశంపై బుధవారం సెమినార్ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్తగా రాహుల్ జైన్, ప్రొఫెషనల్ స్పీకర్, హైదరాబాద్ హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపల్ డి.వెంకటేశ్వరరావు ముఖ్య వక్తను విద్యార్థులకు పరిచయం చేశారు. ముఖ్య వక్త మాట్లాడుతూ క్లాస్ రూమ్‌లో నేర్చుకున్న విద్య ఉద్యోగం సంపాదించడానికి సరిపోదని, మనకున్న జ్ఞానాన్ని నైపుణ్యంగా మలచుకున్నప్పుడే అది ఉపయోగపడుతుందని చెప్పారు. విద్యార్థులందరూ కమ్యూనికేషన్ స్కిల్స్ అభివృద్ధి చేసుకోవాలని, అలాగే ప్రతి ఒక్కరూ వచ్చిన అవకాశాలను సరైన సమయంలో సద్వినియోగం చేసుకుంటూ జీవితంలో ముందుకెళ్లాలని చెప్పారు. పిరికితనం, భయం ఇవి రెండూ కూడా ఉన్నతమైన స్థాయికి ఎదగడానికి అవరోధంగా ఉంటాయని, వీటిని అధిగమించడానికి కృషి పట్టుదల ఉండాలని, ఓడిపోయిన ప్రతిసారీ కుంగి పోకుండా ప్రయత్నిస్తూ ముందుకు కొనసాగాలని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకాడమిక్ అడ్వైజర్స్ ఎబిఎస్ మూర్తి, నందుల సీతారామారావు, మేనేజ్మెంట్ అండ్ కామర్స్ డిపార్ట్మెంట్ అధ్యాపకులు రాధా మాధవి, ప్రసన్న నాగదేవి పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్


వినతిపత్రం అందజేస్తున్న సిబ్బంది

వైద్య ఆరోగ్యశాఖలో ప్రజలకు పలు రకాల వైద్య సేవలందిస్తూ విధులు నిర్వహిస్తున్న 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిబ్బంది బుధవారం నరసాపురం డివిజన్ డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్‌ఒ డాక్టర్ స్వరూప్‌కు, పిహెచ్‌సి డాక్టర్ సౌజన్యకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా 104 జిల్లా ప్రధాన కార్యదర్శి వడూరి సురేష్ మాట్లాడుతూ మూడు నెలలుగా వేతనాలు లేవని, కుటుంబాలను పోషించడం చాలా కష్టంగా ఉందని తెలిపారు. 104 సేవలను ప్రభుత్వమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా నిర్వహించి ప్రజాధనం వృథా కాకుండా చూడాలని, ఉద్యోగులు అందరికీ ప్రతినెలా క్రమంగా జీతాలు చెల్లించాలని, అరబిందో యాజమాన్యం అక్రమంగా వసూలు చేసిన పిఎఫ్ డబ్బులు తిరిగి చెల్లించాలని కోరారు. సీనియార్టీని బట్టి తగిన వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా 104 యూనియన్ ప్రెసిడెంట్ విజయ కుమార్, ప్రధాన ప్రధానకార్యదర్శి వి.సురేష్, వైస్ ప్రెసిడెంట్ జి.సాధు సుందర్ సింగ్, జిల్లా యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

నక్కావారిపాలెంలో చోరీ

25 కాసుల బంగారు ఆభరణాలు అపహరణ

ప్రజాశక్తి - పెనుగొండ

సిద్ధాంతం నక్కావారిపాలెంలో గుర్తుతెలియని వ్యక్తులు ఓ ఇంట్లో చోరీ పాల్పడి 25 కాసుల బంగారు ఆభరణాలు అపహరించిన సంఘటన మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సిద్ధాంతం శివారు నక్కావారిపాలెం గ్రామానికి చెందిన సాదా నాగేశ్వరరావు, అతని భార్య ఇంట్లో నిద్రిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 25 కాసుల బంగారు వస్తువులను అపహరించారు. బాధితుడు పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ కొప్పిశెట్టి గంగాధర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ


రేషన్ బియ్యం పట్టుకున్న అధికారులు

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పెనుగొండ

అక్రమంగా తరలిస్తున్న 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అధికారి వి.రాంబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సిద్ధాంతం వద్ద వాహనాన్ని అధికారులు తనిఖీ చేయగా 30 క్వింటాళ్ల రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరుగుతున్నట్లు గుర్తించినట్లు తెలిపారు. వాహనం యజమానిని, డ్రైవర్ వి.అనిల్ కుమార్‌ను ప్రశ్నించగా పెనుగొండ పరిసర ప్రాంతాల్లో కిలో 19 రూపాయలకు కొనుగోలు రూ.21లకు అమ్ముతున్నట్లు తెలిపారు.

దస్తావేజు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడు మండలం, అలంపురం గ్రామ కాపురస్తులు చంద్రు శ్రీనివాసరావు గారి కుమారుడు చంద్రు నాగ వెంకట సతీష్‌కు చెందిన **దస్తావేజు నెం.1448/2022రు గల ఒరిజినల్ దస్తావేజు** బ్యాగ్‌లో పెట్టుకుని జిరాక్సు నిమిత్తం ది.25-10-2024న మా ఇంటి వద్ద నుండి అలంపురం సెంటరుకు మోటారు సైకిల్ పై వెళ్తుండగా దస్తావేజులు గల బ్యాగు మార్గమధ్యలో పడిపోయినది. కావున దొరికిన వారు క్రింది అడ్రసుకు తెలియచేయగలరు.

చుండ్రు నాగ వెంకట సతీష్
తండ్రి: చుండ్రు శ్రీనివాసరావు,
అలంపురం, పెంటపాడు మండలం
ప॥గో॥ జిల్లా. సెల్: 96185 57776

వీలునామా దస్తావేజు పోయినది

ఏలూరు జిల్లా, ఆగిరిపల్లి మండలం, ఆగిరిపల్లి గ్రామ వాస్తవ్యులు కాట్రగడ్డ (లేటు) లక్ష్మీనారాయణ గారి కుమారుడు కాట్రగడ్డ రాజశేఖరరావు పేరన వున్న ఆగిరిపల్లి మండలం, చిన్నాగిరిపల్లి గ్రామ ఆర్.యస్.నెం. 304/3రు దాఖలా య.2.02 సెంట్లు వ్యవసాయ భూమికి సంబంధించిన ఒరిజినల్ వీలునామా (దస్తావేజు నెం.21/1974) పోయినది. ఆచూకీ తెలిసిన వారు ఈ క్రింది అడ్రసుకు తెలితయపర్చగలరు.

కాట్రగడ్డ రాజశేఖరరావు
తండ్రి: లక్ష్మీనారాయణ (లేటు)
ఆగిరిపల్లి గ్రామం, ఆగిరిపల్లి మండలం,
ఏలూరు జిల్లా. సెల్: 99851 93644

పాస్‌పోర్టు పోయినది

పోడూరు మండలం, పెనుమదంకు చెందిన కొండేటి ధనుంజయ రావు, తండ్రి కొండేటి ధర్మరాజు, డోర్ నెంబర్ 7-39, పెనుమదం, పోడూరు మండలం, ప.గో.జిల్లా., ఏపీ తెలియజేయునది ఏమనగా నేను గతంలో కువైట్ వెళ్లి తిరిగి వచ్చాక నా ఆర్థిక పరిస్థితి బాగోక తిరిగి వెళ్ళాలని నా పాస్ పోర్ట్ నెంబర్ Y7713434 ను వైజాగ్‌లో ది **12-10-2023**న రెన్యువల్ చేయించాను. దీనిని ది **2-11-2024** వ తేదీన జెరాక్స్ తీయు నిమిత్తం నా ఒరిజినల్ పాస్ పోర్ట్ తీసుకుని పెనుమదం నుంచి పాలకొల్లుకు ఆటోలో వచ్చి జెరాక్స్ తీసుకున్నాక తిరిగి ఆటోలో వెళ్ళడానికి సిద్ధం అయి నా బ్యాగ్ చూసుకోగా నా ఒరిజినల్ పాస్ పోర్ట్, నా ఆధార్ కార్డు పడిపోయినవి. దారిలో ఎంత వెతికినను ఎక్కడా దొరకలేదు.కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్ కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

సెల్: 9160055939

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) వారి కోర్టులో
ఐ.ఎ.నెం.156/2024
ఓ.యస్.నెం. 58/2012

బిట్వీన్:
1. చల్లా సత్యన్నారాయణ(డైడ్)
2. శ్రీమతి పోకనాటి వరలక్ష్మి

... పిటీషనర్లు/వాదులు.

మరియు

1. చల్లా బాలాత్రిపుర సుందరమ్మ(డైడ్). 2. చల్లా గంగాభవాని 3. చల్లా అరుణ 4. చల్లా చిన్ని 5. చల్లా సుజాత 6. ధరిమి బేబి 7. రాము సామ్రాజ్యలక్ష్మి,(డైడ్) 8. గట్టి నాగమణి 9. పుట్టుపు మంగాయమ్మ 10. పోల్నాటి విజయలక్ష్మి 11. ఆకుల వెంకట్రావు 12. మారిశెట్టి అమ్మాజి (డైడ్) 13. పోతన కుమారి 14. కామిరెడ్డి సాయిలక్ష్మి 15. రాము ఉమా ప్రహ్లాదరావు 16. అనిశెట్టి మోహన జయలలిత 17. మల్లిపూడి హేమలత

...రెస్పాండెంట్లు/ప్రతివాదులు.

టు

14వ రెస్పాండెంటు:-
శ్రీమతి కామిరెడ్డి సాయిలక్ష్మి, భర్త సాయి, వయస్సు 52 సం॥లు. నివాసము, యర్రంపేట గ్రామము, కొయ్యలగూడెం మండలము, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం మండలము, ఏలూరు జిల్లా, జంగారెడ్డిగూడెం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు పరిధి.

17వ రెస్పాండెంటు:-
శ్రీమతి మల్లిపూడి హేమలత, భర్త గంగాధరరావు, మయస్సు 46సం॥లు, నివాసము కోతిబొమ్మ సెంటర్, గాయత్రి గుడి దగ్గర, వానపల్లివారి గూడెం, తాడేపల్లిగూడెం,ప.గో.జిల్లా, తాడేపల్లిగూడెం అడిషనల్ జిల్లా జడ్జి కోర్టు వారి పరిధి.

పై నెంబరులో చనిపోయిన 7వ ప్రతివాది అయిన మీ తల్లిగారు రాము సామ్రాజ్యలక్ష్మి గారికి మిమ్ములను పై నెంబరు పిటీషన్‌లో వారసులుగాను మరియు దావాలో 14, 17 ప్రతివాదులుగాను చేర్పించమని 2వ పిటీషనరు పిటీషను దాఖలు చేసి, సదరు పిటీషనుపై మీకు కోర్టు ద్వారా రిజిస్టర్డు పోస్టు ద్వారా ఎన్ని సార్లు నోటీసులు పంపించుచున్నను మీరు బుద్ధి పూర్వకముగా తీసుకొనకుండా ఆటంకపరుచుచున్నారు. అందుపై శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము నోటీసులు ఇందుమూలముగా మీకు తెలియపర్చడమైనది. పై నెంబరు పిటీషన్‌లో మీకు ఏమైన ఆక్షేఫణలు ఉన్న యెడల ది. **12-11-2024వ తేదీ పగలు ఉ॥గం. 10.30** నిముషములకు మీరు స్వయంగా గాని లేదా మీ న్యాయవాది గారి ద్వారా హాజరై ఆక్షేపణలు తెలియపరుచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున పై పిటీషను శ్రీ కోర్టువారు తీర్మానించడమగునని ఇందు మూలముగా మీకు తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారము)
కొవ్వూరు. సిరపరపు సుబ్బారావు
05-11-2024 పిటీషనర్లు తరుపు న్యాయవాది.